''దేనికీ ఆందోళన పడాల్సింది లేదు కాత్యా! జీవితంలో దేన్నయినా పాజిటివ్‌గా స్వీకరించే తత్వాన్ని అలవర్చుకోవాలి. పిల్లలు దేవుడిచ్చే బహుమతులని నువ్వే అన్నావు కదా! దేవుడు మనకు ఇలాంటి బహుమతి ఇచ్చాడనుకుందాం. అయినా ప్రకృతి అంటే అంతే కదా కాత్యా! మనం ప్రపంచానికి ఎంత ఇస్తే.. అంతే మనకూ దక్కుతుంది. అది వాస్తవం. సమాజానికి మనవంతుగా దుఃఖం పంచితే, మనకు మాత్రమే ఆనందం ఎలా మిగులుతుంది? నో.. నెవర్!''.

భార్య తన మాటలు వింటున్నదో లేదోనని కూడా ఆమెవైపు చూడలేదు కులకర్ణి.

తన ధోరణిలో తను చెప్పుకొంటూ పోసాగాడు.

''ఇన్నాళ్లూ ఒక డాక్టర్‌గా నువ్వేం చేశావో ఒక్కసారి గుర్తుచేసుకో! డాక్టర్‌గా ఉమ్మనీరులోని ఆకృతికి ఊపిరి పోసి ప్రకృతిలోకి ఆహ్వానించాల్సింది పోయి.. ఏకంగా ప్రాణాలు తీస్తూ హత్యలకు.. భ్రూణహత్యలకు పాల్పడ్డావు. ఒక డాక్టర్‌గా నువ్వు చేయాల్సిన పని కాదది. అయినా నువ్వూ ఒక అమ్మవే కదా! ఏనాడు కూడా ఒక అమ్మగా ఆలోచించ లేకపోయావు. నీ చెంతకు వచ్చిన ఆడ కూతుళ్లకు కౌన్సెలింగ్ చేసి అబార్షన్‌ల బారినుంచి విరమించుకునేలా కనీస ప్రయత్నం కూడా చేయలేకపోయావు. నువ్వు తలుచుకుంటే అది సాధ్యమయ్యేది. భ్రూణహత్యలు జరగకుండా ఆపగలిగే దానివి. కానీ, ఎప్పుడూ అలాంటి మంచి పనికి పూనుకోలేదు. స్వార్థంగా, వ్యర్థంగా ఆలోచించావు''.. తాను చెప్పదలుచుకున్నది సూటిగా చెప్పేశాడు కులకర్ణి.

కాసేపు ఆ గదిని నిశ్శబ్దం ఆక్రమించేసింది.

డాక్టర్ కాత్యాయిని తన మనసులో విచారాన్ని వదిలిపెట్టి.. కొత్త ఆలోచనలకు తావిస్తున్నదన్న విషయం ఆమె వాలకాన్ని బట్టి గ్రహించ గలిగాడతను.

అందుకే తిరిగి గొంతు విప్పాడు.

''ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. వాస్తవం గ్రహించు. అంతా మంచే జరుగుతుంది. ఎంత డాక్టర్‌వైనా నువ్వూ అమ్మవే కదా!''.

* * *

కొద్దిరోజుల తర్వాత..

ఎప్పటిలాగే పేషెంట్లను చూడటానికి హాస్పిటల్‌కు వెళ్తున్నది డాక్టర్ కాత్యాయిని.

''హలో.. డాక్టరమ్మా!''.

''వీరేశం.. చెప్పు''.

''మరో కేసు వచ్చింది. పరీక్ష చేసి ఆడపిల్ల అయితే కడుపు తియ్యాలి. పంపమంటవా డాక్టరమ్మా?''..

ఫోన్‌లో కాత్యాయినితో మాట్లాడుతున్నాడు వీరేశం.

''నేనిప్పుడు అబార్షన్లు చేయడం లేదు''..

ముక్తసరిగా జవాబిచ్చింది డాక్టర్.

''అయ్యో! ఇప్పుడెలా? వాళ్లకు మాట ఇచ్చానమ్మా! పోనీ ఒక పని చేయరాదు డాక్టరమ్మా! ఈ ఒక్కసారికి పని పూర్తి చేసిపెట్టు. ఇకనుంచి మరొక డాక్టర్ జాడ చూసుకుంటానమ్మా!''.

ఒక్క క్షణం మాట్లాడకుండా ఉండిపోయిందామె.

ఏదో స్ఫురించిన కాత్యాయిని..

''అక్కర్లేదు వీరేశం. మరో డాక్టర్‌ను వెతుక్కోవాల్సిన పనిలేదు. ఎప్పటిలాగే నీ దగ్గరికి వచ్చిన వాళ్లను నా చెంతకు పంపు. సరేనా! నీ కమిషన్ గురించి భయపడకు. నీకు రావాల్సింది ఇచ్చేస్తాను'' అన్నది.

''సరే!'' అంటూ ఫోన్ పెట్టేశాడు.

* * *

తనకు ఎదురుగా కూర్చుని భయంగా చూస్తున్న ముప్పై ఏళ్ల మహిళను..

''చెప్పమ్మా! ఏంటీ నీ ప్రాబ్లం?'' నింపాదిగా అడిగింది డాక్టర్ కాత్యాయిని.

విషయం ఎలా మొదలుపెట్టాలో తెలియక కాసేపు లోలోపల సతమతమయ్యిందా మహిళ.

''పర్లేదు.. దాచకుండా చెప్పు! నువ్వు, నేను తప్ప ఈ గదిలో మరెవరూ లేరు కదా! భయం దేనికమ్మా? సంకోచించకుండా విషయమేంటో చెప్పు!''.

బిడియ పడుతూనే..

''స్కానింగ్ చేసి నా కడుపులో పెరుగుతున్నది ఆడపిల్లనా, మగ పిల్లవాడా చెప్పాలి డాక్టర్!''.

అసలు విషయం బయటపెట్టిందామె.

''స్కానింగ్ తప్పక చేస్తాను. కేవలం లోపల పెరుగుతున్న పిండం ఆరోగ్యం తెలుసుకోవడానికి మాత్రమే! కానీ నువ్వు మోస్తున్నది ఆడ, మగ ఎవరనేది మాత్రం నీకు తెలియనివ్వను''.. ఆమె ముఖంలోకి సూటిగా చూస్తూ చెప్పింది డాక్టర్.

అది విని ఆ మహిళ ముఖకవళికలు మారిపోయాయి.

''ఏమంటావు?'' కావాలని ప్రశ్నించింది డాక్టర్.

''లింగ నిర్ధారణ చేసి తప్పకుండా చెప్పాల్సిందే డాక్టర్! లేకపోతే వాళ్లు నాకు డబ్బులివ్వనన్నారు''.

''వాళ్లా!? ఎవరు?''.

''నేను సరోగసి మదర్‌ను డాక్టర్!''.

''ఓ.. ఐసీ!''.

''మా ఒప్పందం అలాగే జరిగింది డాక్టర్. మగ పిల్లవాడు అయితేనే వాళ్లు పిల్లవాణ్ని తీసుకొని ఒప్పందం ప్రకారం ఇవ్వాల్సిన డబ్బులు ఇస్తామన్నారు. ఆడపిల్ల అయితే స్వీకరించమన్నారు. అలాగైతే నాకు వాళ్లకు ఎలాంటి సంబంధం లేదన్నారు''.

''ఇట్స్ ఓకే!''.

''రహస్యంగా లింగనిర్ధారణ చేసి చెబితే డాక్టర్‌కు ముప్పై, నలభై వేల వరకైనా డబ్బులు ఇస్తామన్నారు''..

డబ్బు ఆశ చూపిందా మహిళ.

సాలోచనగా తల పంకిస్తూ..

''టెస్ట్ చేయకుండానే నీ కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని అనుకుందాం. సో అప్పుడేం చేస్తావ్?'' ప్రశ్నించింది కాత్యాయిని.

''ఏం చేయడమేంటి డాక్టర్? అబార్షన్ చేసి పంపించండి. అందుకేగా మీ దగ్గరికి వచ్చాను''.

''కుదరదు. లింగ నిర్ధారణ, భ్రూణహత్య చేసినవారు, చేయించుకున్నవారు ఇద్దరూ చట్టం దృష్టిలో నేరస్తులే! ఒకవేళ చట్టానికి దొరక్కపోయినా దేవుని కోర్టులో తప్పక శిక్ష పడుతుంది'' స్థిరంగా చెప్పింది కాత్యాయిని.

డాక్టర్ మాటలు పట్టించుకోకుండా..

''ఆడపిల్ల అని తేలితే అబార్షన్ చేయించడానికి మీకు లక్ష రూపాయలు ఇవ్వడానికైనా వాళ్లు సిద్ధంగా ఉన్నారు''.

మరో మాట చెప్పిందా మహిళ.

''ఆ లక్ష ఇస్తానంటే నా బదులు మరొకరైనా నీకు అబార్షన్ చేస్తారేమో? ఆ విషయం వదిలిపెట్టు. ఒక పని చెయ్! ఆడ, మగ ఎవరైతేనేం? ఒక తల్లిగా ముందా శిశువుకు జన్మనిస్తానని వాళ్లతో చెప్పు. అలా కుదరదని వాళ్లంటే.. తెగతెంపులు చేసుకో! పుట్టిన శిశువును నీ సొంత బిడ్డగానే స్వీకరించు!''.

''అదెలా కుదురుతుంది డాక్టర్? నాకు ఆల్రెడీ ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పైగా పుట్టబోయేది మళ్లీ ఆడపిల్ల అయితే నేనెటు పోయేది? ఇప్పుడు నాకున్న ఆర్థిక పరిస్థితుల్లో ముగ్గురు ఆడపిల్లలను సాకడం మావల్ల కాదు''.

''అమ్మవి కదా! ప్రాణానికి ప్రాణమైన నీ గర్భంలోని ప్రాణికి జన్మనివ్వడానికి సంకోచిస్తున్నావేం? అబార్షన్ చేయించుకుని పాపం మూట కట్టుకుంటావా? ఏం.. నీలో రూపుదిద్దుకుంటున్న శిశువు నీ రక్తమాంసాలు కాదా? నీ ఊపిరి కాదా? బాగా ఆలోచించి సానుకూలంగా నిర్ణయం తీసుకో!''..

ఆమెలో ఆత్మస్థయిర్యాన్ని నింపడానికి ప్రయత్నిస్తున్నది కాత్యాయిని.

బదులుగా తలవంచుకుందా మహిళ.

ఆమె పాజిటివ్‌గానే స్పందిస్తున్నట్టు నమ్మకం కలిగింది కాత్యాయినికి.

''చూడమ్మా! నువ్వు సరేనంటే ఇప్పటినుంచి మొదలుకొని నీ డెలివరీ అయ్యేంతవరకు ఒక్క నయాపైసా ఫీజు కూడా తీసుకోను. ఆర్థికంగా కూడా నీకు వెన్నంటి ఉంటా! బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో! వీలైతే ఒకసారి మీ వారిని కూడా సంప్రదించు''.

డాక్టర్ మాటలు ఆమెకు ఎనలేని ధైర్యాన్ని ఇచ్చినట్టున్నాయి. అప్పటికే ఒక స్థిర నిశ్చయానికి వచ్చేసిందా మహిళ.

దిగులు పోయి ఆ మహిళ వదనం కాంతిమంతం అవుతుంటే..

''కడుపులో పెరుగుతున్నది ఎవరైనా సరే! నా మూడో బిడ్డగా సగర్వంగా లోకానికి పరిచయం చేస్తాను!''..

ఆప్యాయంగా తన కడుపును తడుముకుంటూ, ఆత్మవిశ్వాసంతో తలెత్తి ధైర్యంగా అన్నదా మహిళ.

అది విని కాత్యాయిని కనురెప్పలు తడిశాయి. మొదలైన తన దిగ్విజయ యాత్రకు నాందిగా ఈ తొలి విజయం ఆమెను ఉద్విగ్న భరితం చేసింది. ■

## ఎనుగంటి వేణుగోపాల్



సామాజిక రుగ్మతలను ఎత్తిచూపుతూ రచనలు చేయడంలో ముందుంటారు ఎనుగంటి వేణుగోపాల్. ఈయన స్వస్థలం జగిత్యాల. ఎంఏ (తెలుగు), ఎంఏ (సోషియాలజీ) చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 1985 నుంచి రచనలు చేస్తున్నారు. ఇప్పటివరకూ 176 కథలు, 60 కవితలు, 4 నవలలు రాశారు. ఇప్పటివరకూ 9 కథా సంపుటాలు, ఒక నవలతోపాటు మరో మూడు పుస్తకాలను వెలువరించారు. బుజ్జిగాడి బెంగ, చెలి, శాలివాహన, కన్నీటి కావ్యం, ఆ దృశ్యం కథలు.. అవని, ట్వింకిల్ ట్వింకిల్ వండర్ స్టార్ నవలలు గుర్తింపు పొందాయి. అన్ని ప్రముఖ దిన, వార, ఆన్‌లైన్ పత్రికల్లో ఈయన కథలు ప్రచురితమయ్యాయి. సాహిత్య సేవలో భాగంగా అనేక సన్మానాలు, సత్కారాలు పొందారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జగిత్యాల కలెక్టర్ చేతుల మీదుగా 'విశిష్ట సాహితీవేత్త' పురస్కారం అందుకున్నారు. 'ఉత్తమ సాహితీవేత్త' పురస్కారం, 'గాన కోకిల కళానికేతన్' నుంచి 'సాహితీ రత్న' బిరుదు దక్కించుకున్నారు. 'శ్రావణి సామాజిక సాహితీ సాంస్కృతిక సమాఖ్య' ద్వారా 'విశిష్ట సాహితీ పురస్కారం', 'ఆంధ్ర సారస్వత సమితి' నుంచి 'ప్రతిభా పురస్కారం' అందుకున్నారు.